క్లుప్తంగా...

నేడు తాగునీటి సరఫరా బంద్

కుషాయిగూడ: భరత్‌నగర్ రిజర్వాయర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భరత్‌నగర్ రిజర్వాయర్‌లో మెయిన్ వాల్వ్ సమస్య కారణంగా ఐదు రోజులుగా ఇబ్బందులు పడుతున్న చిన్న చర్లపల్లి, పెద్ద చర్లపల్లి, మింట్‌కాలనీ, భరత్‌నగర్, రైల్‌విహార్‌కాలనీ, పుకట్‌నగర్ కాలనీలకు బుధవారం కూడా నీటి సరఫరా ఉండదన్నారు. ఇప్పటికే మరమ్మతులు మొదలయ్యాయని, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కాలనీల ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

వేర్ హౌజ్‌లో అగ్ని ప్రమాదం



ఉప్పల్: రామంతాపూర్ సెయింట్ రీజినల్ సెమినరీ చర్చి కాంపౌండ్‌లోని వియర్ హౌజ్‌లో మంగళవారం ఉదయం విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. పోలీసుల వివరాల ప్రకారం.. చర్చి కాంపౌండ్‌లో ఉన్న వేర్ హౌజ్‌లో క్యామ్‌లీన్(స్టేషనరీ), నవనీత్ లిమిటెడ్(టెక్స్ట్ బుక్స్), లోరియల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(కాస్మటిక్స్)ల స్టోరేజ్ వేర్ హౌజ్ ఉంది. ముంబై నుంచి నేరుగా వచ్చిన స్టాక్‌ను ఇక్కడ స్టోర్ చేసుకుంటారు. మంగళవారం ఉదయం మంటలు రావడంతో సెక్యూరిటీ సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు, సంస్థ నిర్వాహకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. సంస్థ యాజమాని ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



మచ్చబొల్లారంలో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 52వ రోజు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలు తగ్గిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.500లకే అందజేస్తామని చెప్పారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. యువకులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఇటీవల కర్ణాటకలో వెలువడిన ఫలితాలే రాష్ట్రంలో వస్తాయన్నారు.

ఇష్టంగా తినేలా..

- అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీకి కసరత్తు
- ప్రభుత్వ నిర్ణయంతో జూన్ నుంచి సరఫరా చేసేలా..
- మేడ్చల్ జిల్లాలో 733 కేంద్రాల్లో 1.01 లక్షల మంది లబ్ధిదారులు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల మేలుకోరి పంపిణీకి శ్రీకారం





సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలు, పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, చిరుతిండ్లు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. భోజనం మాత్రం దొడ్డు బియ్యంతో తయారు చేస్తుండటంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగన్‌వాడీలకు సన్నబియ్యం అందించేలా నిర్ణయం తీసుకుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా జూన్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేయనున్నారు.

దొడ్డు బియ్యం భోజనం ఇష్టం లేక..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, పప్పులు తదితర పౌష్టికాహారంతో పాటు నిత్యం దొడ్డు బియ్యంతో భోజనం తయారు చేస్తున్నారు. పాలు, గుడ్లు, బాలామృతం వినియోగిస్తున్నంత ఇష్టంగా దొడ్డు బియ్యం భోజనాన్ని లబ్ధిదారులు తీసుకోవడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం అందించి అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం దొడ్డు బియ్యం సరఫరా చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో మరింత ఇష్టంగా భోజనం చేసేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తారని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

733 కేంద్రాలు 1.01 లక్షల మంది లబ్ధిదారులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 733 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,01,419 మంది లబ్ధిదారులు ఉండగా, ఇందులో చిన్నారులు 78,087 మంది, గర్భిణులు, బాలింతలు 23,332 మంది ఉన్నారు. ప్రతి నెలా సరాసరి ఒక్కో కేంద్రానికి 55 నుంచి 60 కిలోల బియ్యం పంపిణీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దొడ్డు బియ్యం భోజనాన్ని చిన్నారులకు ఒక్కొక్కరికి 75 గ్రాములు, బాలింతలు, గర్భిణులకు 150 గ్రాముల చొప్పున వండి వడ్డిస్తున్నారు.

ఆదేశాలు రాగానే పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు జూన్ నుంచి సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు సన్నబియ్యం భోజనాన్ని తినడానికి అవకాశం ఉంటుంది.

– అక్కేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో, మేడ్చల్ జిల్లా.

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

– ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

రామంతాపూర్: గ్రేటర్ సత్యానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి తమ కాలనీలో భూగర్భ డ్రైనేజీ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మురుగు రోడ్లపై పారుతోందని వెంటనే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలని వినతి పత్రం సమర్పించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, అందులో భాగంగా సత్యానగర్‌లో నూతనంగా భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆర్కేరెడ్డి, శివకుమార్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ దయానంద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్యాణ్‌కుమార్

బోడుప్పల్: డివిజన్‌లో ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ అన్నారు. మంగళవారం అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆయన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి పరీక్షలు, మందులు, కళ్లద్దాలు, అవసరమైన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ కూడా ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ శంకర్, కాలనీ వాసులు ఆంజనేయులు, మల్లేష్, శ్రీను, మధు, మహేష్, సురేష్, సాయి, దాస్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



ఓపెన్ నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి

రామంతాపూర్: వర్షాకాలం మొదలయ్యే లోపే డివిజన్‌లో వివిధ కాలనీలు, బస్తీల్లో జరుగుతున్న ట్రంక్ లైన్ బాక్స్‌డ్రైన్, ఓపెన్ నాలాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రాంశంకర్‌నగర్‌లో నిర్మిస్తున్న ఓపెన్ నాలా పనులను ఆమె జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు మొదలు కాకముందే ఈ పనులు పూర్తి చేయాలని, లేకపోతే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ నేతలు బండారు వెంకటరావు, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో రాగిడి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ చౌరస్తాలో ఆద్య పాలిక్లీనిక్ అండ్ ఫార్మసీ, డా.కార్తీక్, శరత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ డెంగ్యూ అవగాహన, ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా తన సంపాదన నుంచి కొంత వరకు పేద ప్రజల సేవకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, ఎండీ రఫీ, రవీందర్‌గౌడ్, బొల్లం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందనలు

బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని బోడుప్పల్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సీబీఎస్‌ఈ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల మంచి ఫలితాలు సాధించామన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు కౌశిక్ రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ సునీత, ప్రిన్సిపాల్ నళిని జయ, వైస్ ప్రిన్సిపాల్ నిలిమా విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తూ..

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు చదవలేని పేద విద్యార్థులకు పాతుకూచి సోమసుందర సామాజిక సేవా, దాతృత్వ సంస్థ ప్రతినిధులు చేయూత అందిస్తున్నారు. చర్లపల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పాసై పాలిసెట్ రాసేందుకు ఫీజు కట్టలేని సుమారు 200 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించి తోడ్పాటు అందించారు. చర్లపల్లిలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేశారు. నగరంలో 12 కేంద్రాల్లో ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకుడు రాము తెలిపారు.

వైభవంగా ఉప్పల్ రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



ఉప్పల్: ఉప్పల్ రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

డ్రైనేజీ పనులను త్వరగా ప్రారంభించాలి



జలమండలి జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో భూగర్భ డ్రైనేజీ కోసం మంజూరైన రూ.36 లక్షల పనులను త్వరగా ప్రారంభించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ జలమండలి జీఎం సతీష్‌ను కోరారు. మంగళవారం జలమండలి అధికారులతో నాచారం కార్పొరేటర్ పలు సమస్యలపై సమీక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో లోప్రెషర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందిరానగర్ వైపు వేసిన ట్రంకు లైన్, బాబానగర్ ఎస్టీపీ నుంచి నల్ల చెరువు వరకు ఉన్న ట్రంక్ లైన్లను శుభ్రపర్చాలని మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో డీజీఎం సతీష్, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, షేక్ రఫీక్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే పెద్ద బలగం

- రాష్ట్రానికి రోల్ మోడల్‌గా పీర్జాదిగూడ కార్పొరేషన్
- మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పీర్జాదిగూడ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలని కన్వెన్షన్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు దర్గా దయాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు పీర్జాదిగూడ కార్పొరేషన్ అంటే మక్కువని, నిరంతరం అభివృద్ధిపై అడిగి తెలుసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో పీర్జాదిగూడ నంబర్–1 కార్పొరేషన్‌గా నిలిచిందంటే ఇది పాలకవర్గ సభ్యులు, నగర ప్రజలతోనే సాధ్యమైందన్నారు. బీఆర్ఎకు కార్యకర్తలే పెద్ద బలగం అన్నారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఫ్లైఓవర్ పనులు ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, అదే రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో జరుగుతున్న రోడ్లు, ఫ్లైఓవర్ పనులను సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తోందని అన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత పరిస్థితి ఎలా ఉందో మనం చూస్తున్నామని, ఇది కేసీఆర్‌తోనే సాధ్యమని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడాలేని అభివృద్ధి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిగిందని, అందులో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవడం మేయర్, పాలకవర్గం కృషి అన్నారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నగరం అభివృద్ధి చెందుతోందంటే డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్, కార్పొరేటర్ల, కోఆప్షన్ సభ్యుల తోడ్పాటు, ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. ఉద్యమకారులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎన్‌ఎఫ్‌సీలో కార్మికుడు మృతి



గంజి శ్రీనివాస్(ఫైల్)

కుషాయిగూడ: ఓ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌ఎఫ్‌సీలో చోటు చేసుకుంది. వివరాలు.. భవానీనగర్‌లో నివసించే గంజి శ్రీనివాస్ ఎన్‌ఎఫ్‌సీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 10 గంటలకు సెకండ్ షిఫ్టునకు వెళ్లాడు. మంగళవారం ఉదయం విధులు ముగిసే సమయానికి పనిచేసే ప్లాంట్ నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బంది వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అప్రమత్తమైన అధికారులు వెంటనే ఎన్‌ఎఫ్‌సీ సంజీవనికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో చనిపోయినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ మృతికి ప్లాంట్ మేనేజర్ స్వాతి మోహన్, ప్లాంట్ డీజీఎం టీకే సిన్హా, మిశ్రాలే కారణమంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలోనే హార్ట్ ఎటాక్ వచ్చిందని ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నైట్ షిఫ్టుల్లో నిద్రలేకుండా విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని, మార్నింగ్ షిఫ్టులో అవకాశం కల్పించాలని పలుమార్లు వేడుకున్నా పట్టించుకోలేదని పలుమార్లు శ్రీనివాస్ తెలిపాడని మృతుడి కుటుంబ సభ్యులు అన్నారు. ప్లాంట్ మేనేజర్ స్వాతిమోహన్, డీజీఎం సిన్హా, మిశ్రాలపై కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన బీఎల్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ, నగదు పురస్కారాన్ని అందజేస్తున్న బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: మూడు రోజులుగా జరిగిన బీఎల్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్‌లో కుషాయిగూడ జట్టుతో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చక్రీపురం జట్టు విజేతగా నిలువగా, కుషాయిగూడ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం సాయంత్రం చర్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీతో పాటు రూ.50 వేలు, రూ.20 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుతో పాటు క్రీడారంగంలో రాణించిన చాలామంది ఉన్నత స్థానాలకు చేరుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు బీఎల్‌ఆర్ ట్రస్టు తగిన ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకుడు మూరి మహేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేత జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, యాదిరెడ్డి, ఆనంద్, కడియాల బాబు, దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సబిత కిషోర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సన్‌రైజ్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన తలపెట్టిన తాగునీటి పైపు లైన్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.

అమ్మవార్లను ఆరాధిస్తే శుభాలు



రామంతాపూర్: నేతాజీనగర్‌లోని శ్రీనల్ల పోచమ్మ దేవాలయం అమ్మవారి 5వ వార్షికోత్సవ వేడుకలకు మంగళవారం ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోచమ్మ మైసమ్మ మహంకాళి, ఎల్లమ్మ వారిని ఆరాధిస్తే అన్ని శుభాలే జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం, ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు చాంద్ పాషా, శంకరరరావు, రాజలింగం, శేఖర్, విశాల్, సాయిబాబా, సందీప్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.